కథానిక

# షష్టిపూర్తి

టేకుమళ్ల కామేశ్వరరావు

గరికపురం చుట్టుపట్ల నాటుదారులలో నడిచే నీలి పువ్వుల బండి ఎవరిదో ఇట్టే చెప్పొచ్చు. పిల్ల జమీందారైన కాంచన మూర్తిది. బండి షోకుగా ఉంటుంది. ఉషారైన తెల్ల ఎద్దుల జోడా. వాటి మెడలలో మువ్వలు, కొమ్ముల చివర ఇత్తడి పొన్నులు, నడుముల వారు పటకాలు. కమానుల బండి సవారుకి పనికి వచ్చేటట్లుగా తేలికగా ఉంది. దిట్టమైన గూటిమీద నీలిపువ్వుల కాన్వాసు గుడ్డ. బండి లోపల రత్న కంబళం, పరుపు, టెక్కేలు.

కాంచన మూర్తిది దివ్యమైన రెండంతస్తుల మేడ. ఇంటిదగ్గర చిన్ననాడు గురువుగారు నేర్పిన విద్య ఆయన సాధనవల్ల క్రమంగా వృద్ధి చెందింది.

ఆ ఊరికి ఆయనే పెద్ద. పెద్ద ఆఫీసరు లెవరు వచ్చినా, ఇతర పెద్దలెవరు వచ్చినా ఆయన ఇంటిలోనే మకాం. అందరి పరిచయం వల్ల ఆయన ఆధునికజ్ఞానంతో వర్ధిల్లుతున్నాడు.

కాంచనమూర్తికి పెట్టుపోతలు లేవన్న మాట అందరికీ తెలుసు! కాని ప్రకృతియొక్క వ్యాజమో అన్నట్లుగా ఆయనకి గంపెడుపిల్లలు. వేరే సత్రములు పెట్టించక్కరలేదు. ఆ బల గాన్ని పోషించడమే చాలు.

ఆయన ఐశ్వర్యాన్నిబట్టి కొన్ని గౌరవోద్యోగాలు, "వద్దు, వద్దు" అన్నప్పటికీ వరించేయి. ఆయనకి ఉండే మొదటిభయమల్లా పైసదగ్గరే. అది తప్పించి మీరు ఎన్ని కబుర్లు చెప్పండి వింటాడు. ఎన్ని సంగతులు అడగండి చెప్తాడు. అనాధశరణాలయానికి చందాలనో, పుస్తక భాండాగారానికి విరాళమనో మరేదో మరేదో లోకోపకార సంస్థలని భావించే కొందరు ఆయనను యాచించక మానరు. చివరకి ఆయన ఆ ఊళ్ళో ప్రాథమిక పాఠశాలకేనా రూపాయి ఖర్చుపెట్టి ఎరగడు.

కాంచనమూర్తి నిష్ఠాపరుడని చెప్పక తప్పదు. బ్రాహ్మణుడు వచ్చి దేవతార్చనచేసి పోతూంటాడు. పిల్లజమీందారు స్వయంగా భారత భాగవత రామాయణాది పురాణ గ్రంధాలే గాకుండా వేదాంత గ్రంథాలను కూడ క్షుణ్ణంగాచదివేడు. నిత్యపారాయణ అన్న పేరు మాత్రమే లేకుండా భగవద్గీతను నిత్యము పఠిస్తూంటాడు.

ఆయన పిల్లలందరు పెద్దవాళ్ళయేరు. కూతుళ్ళందరికీ వివాహాలయి వాళ్ల కాపరాలు వాళ్లు చేసుకొంటున్నారు. సంసారభారం కొడుకులు వహించేరు. కాంచనమూర్తి ఇంటి విషయం పట్టించుకోవలసిన అవసరం యెంత మాత్రమూలేదు. సంసార బాధ్యతలు పూర్తిగా వదిలించుకొని రామకృష్ణ అనుకొంటూ గడపవలసిన కాలం సమీపించిందని ఆయన గాఢంగా తలపోస్తున్నాడు. షష్టిపూర్తయిందనిపించుకోడం కోసం యెదురు చూస్తున్నాడు. ఆ మరుచటి రోజునుంచే జీవితంలో సరికొత్త ప్రకరణం ప్రారంభిస్తుంది. శాస్త్రాలలో చెప్పిన ప్రకారం రాజర్షిలాగు జీవించి, జనకాదులను మించిపోదలుచుకొన్నాడు. ఆయనకు కీర్తిమీద ఆశ ఉందని కాదు. ప్రపంచంలో కీర్తికి డబ్బుకి లంకె. కాబట్టి అదెంత మాత్రమూ పనికిరాదు. అటువంటి మచ్చలేని పరిశుద్ధ కీర్తి కోసమే ఆయన చూస్తున్నాడు.

కాంచనమూర్తి ఎవ్వరికీ ఒక్క దమ్మిడీ ఇచ్చిన పాపాన్ని పోలేదు. కాని ప్రజలు కాంచనారాధకులు కాబట్టి ఆయనయెడల భక్తి శ్రద్ధలు కలిగుంటారు.

ఆయనకి షష్టిపూర్తి సమీపిస్తున్నట్లుగా ఊరివారందరికీ తెలుసు. ఆ ఉత్సవాన్ని జయప్రదంగా జరిపించి కొంత గౌరవం తాము కూడా కూడగట్టుకొన తలిచేరు.

ఒక రోజున నలుగురు పెద్దలు పదిమంది పిన్నలను వెంట వేసుకొని సరాసరి కాంచనమూర్తి మేడమీదికి వెళ్ళేరు. షష్టిపూర్త్యుత్సవాన్ని గురించి అందరూ సరసంగా మాట్లాడుకొన్నారు. ఊరికి వచ్చిపోయే పెద్దలు ఆ ఉద్యమాన్ని గురించి విన్నారు. కొందరు కాంచనమూర్తిని అభినందించేరు, కొందరు శ్లాఘించేరు. కాంచనమూర్తి మాత్రం తటస్థంగా ఉన్నాడు.

నవానందస్వామి దేశసంచారం చేసుకొంటూ గగికపురం కూడా దయచేశాడు. పిల్ల జమీందారుగారి భవనంలోనే మకాం వేసేడు. ఊరివారంతా స్వామి దర్శనం చేసుకొని జన్మసాఫల్యం పొందేరు. కాంచనమూర్తి వేదాంత శిరోమణి అని విని స్వామి చాలా సంతోషించేడు.

త్వరలోనే సంసార బంధంనుంచి స్వేచ్ఛను పొందదలుచుకొన్న కాంచనమూర్తి స్వామితో వేదాంత గోష్ఠిని అభిలషించేడు. ఇంతకీ ఆయన స్వామిదగ్గిరనుంచి నేర్చుకోవలసిన దేముంది కనక! అందుచేత జీవితాన్ని తాను అర్థం చేసుకొన్న విధాన్ని స్వామికి విశదీకరించ దలుచుకొన్నాడు.

"నా వేదాంతం ఉక్తి జ్ఞానమే కాదు, ఆచరణతో కూడినది" అన్నాడు కాంచనమూర్తి.

ఆ మాటలు విని నవానందస్వామి నిజంగా ఆనందించేడు.

"జీవితాన్ని వేదాంతాన్ని నేను సమన్వయించుకొన్న విధానాన్ని చెపుతున్నాను వినండి: సూక్ష్మ జీవులదగ్గిరనుంచి బ్రహ్మదేవుడిదాకా ఎవరు చేసుకొన్న కర్మను వారు అనుభవిస్తారు. మనుష్యుల సంగతి అంతే అని వేరే చెప్పనక్కరలేదు. ఎవరి కర్మ వారనుభవించేటప్పుడు మరొకరు అడ్డుపడకూడదు. అట్లాగు అడ్డుపడ్డారా, కర్మానుభవాన్ని పొందనియ్యని పాపాన్ని తాము పొందుతారు. కాబట్టి మనుష్యులు ఊరికే చూస్తూ ఊరుకోవలసిందే కాని మరొకరికి సహాయపడకూడదు." అన్నాడు పిల్ల జమీందారు. స్వామి విస్తుపోయి వింటున్నాడు.

"ప్రతివాడు కష్టపడి ధనం సంపాదించుకొంటూ బాగుపడాలి. లేకపోతే మనిషి సోమరి అయిపోతాడు." అని కాంచనమూర్తి గంభీరంగా ఆగేడు.

చెప్పినది అంతవరకు బాగానే ఉందని స్వామి తలపోసేడు.

"ఆ కారణంవల్ల మనం ఎవ్వరికీ ఎన్నడూ ఒక్క దమ్మిడీకూడ దానం చెయ్యకూడదు. చేస్తిమా, సోమరితనాన్ని ప్రోత్సహించిన వాళ్ళమవుతాం" అని ఆగేడు కాంచనమూర్తి.

అంతా అసందర్భంగా తోచింది స్వామికి.

"ఇంకో మరొక సంగతి వినండి. ఇటువంటి కారణాలవల్ల జ్ఞానమార్గంకంటె మరొక మార్గం లేదని ఘంటాపథంగా చెప్పవచ్చు. జ్ఞానమార్గానికి ధనంతోటి దసకంతోటి నిమిత్తం లేదు. భగవద్గీతను జ్ఞానపరంగా అర్థం చేసుకొన్నవాడే జ్ఞానమూర్తి. వాడే పురుషోత్తముడు. వాడికే మోక్షం" అని కాంచనమూర్తి సంపూర్ణమైన విశ్వాసముతో గంభీరంగా వచించేడు.

నవానందస్వామి నిష్క్రియగా కూర్చున్నాడు. మాటలు అసలే తోచలేదు.

"ఏమిటి మీ అభిప్రాయం?" అని కాంచనమూర్తి స్వామియొక్క ప్రశంసకోసం ఎదురుచూసేడు.

"కర్మమార్గంలో మీకు నమ్మకం లేదు, వాదనలో నాకు నమ్మకంలేదు. ఎవడి కర్మ వాడు అనుభవిస్తాడని మీరు చెప్పనేచెప్పేరు" అని పలికి స్వామి ఊరుకొన్నాడు.

ఆవే ప్రశంసా వాక్యాలుగా పరిగణించుకొన్నాడు కాంచనమూర్తి.

తన షష్టిపూర్త్యుత్సవానికి ఉండవలసినదని కాంచనమూర్తి నవానందస్వామిని స్వయంగా కోరగా 'ఏ వేళకి ఎక్కడుంటానో నాకే తెలియదు' అని స్వామి సూక్ష్మంగా చెప్పి ఊరుకున్నాడు.

షష్టిపూర్త్యుత్సవానికి అనేకమందికి ఆహ్వాన లేఖలు వెళ్ళేయి. పందిళ్ళు పాకలు వేస్తున్నారు. విపులంగా అలంకరిస్తున్నారు.

అప్పటే వారంరోజులనుంచి కావలసినంత సందడిగా ఉంది. ఉత్సవాల రోజున సభలు, మేళతాళాలు, భజనలు, పద్యపఠనం, పాట కచ్చేరీలు, హరికథ, వినోదాలు, విందులు మొదలైన వాటితో సభ్యులను ముంచెత్త దలుచుకొన్నారు.

కాంచనమూర్తి సభకు సభ్యులంతా వచ్చేరు. పెద్ద పెద్ద ఉద్యోగస్తులంతా ఆ కిందటి రాత్రే దయచేశారు. రానివారు రాకపోయినందుకు విచారిస్తూ తెగబారెడు ఉత్తరాలు రాసి రాకపోయినలోటు తీర్చుకొన్నారు.

ప్రజలకోసం అక్కడ దుకాణాలు కాఫీ హోటేళ్లు వెలిశాయి. ఉత్సవంరోజున ఊళ్ళో బడికి సెలవు. దేవాలయంలో దేవుణ్ణి ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవం నాటిపొద్దున్న కాంచనమూర్తిని సతీ సమేతంగా సన్మానించ దలుచుకొన్నారు. సాయంత్రం పూట నీలిపువ్వుల బండికి పన్నెండు జతల ఎడ్లను కట్టి కాంచనమూర్తిని ఊరేగించ దలుచుకొన్నారు.

ఆ రాత్రంతా మనుష్యుల సందడి, గాస్ లైట్లు పట్టపగలులాగు చేస్తున్నాయి. మేడ తలుపులన్నీ బారుగా తీసున్నాయి. నిద్రపోయేవాళ్లు నిద్రపోతున్నారు. తిరిగేవాళ్లు తిరుగుతున్నారు.

రాత్రి కాంచనమూర్తి పరుపుమీద పడుకున్నాడు. ఏవో కొన్ని ఆలోచనలు రేగేయి. "బతుకు ఎంత చిత్రమైనది! అరవై ఏళ్ళబతుకు సుఖస్వప్నంలాగు గడిచిపోయినట్లే కదా! కాని ఇది వేడుకకి సమయమవునా కాదా అని ప్రశ్న. కలికాలంలో అరవై ఏళ్లు బతికినందుకు ఆనందించవలసిందే, ఇతరులు అభినందించ వలసిందే! కాని మరొక వైపునుంచి మృత్యువు సమీపిస్తూందని విచారించనవసరం లేదా!......ఈ జీవితంలో నేను సాధించిన కొన్ని మహత్తర విషయాలు లేకపోలేదు. నా ఆస్తిపాస్తులను ఏమీ వ్యయం చెయ్యక జాగ్రత్తగా కాపాడుకొన్నాను. నా దృష్టిని బెట్టుకొన్న ఉన్నతాదర్శాలను తు.చ. తప్పకుండ పాలించేను. ఆఖరిమాట! నా ఖర్మం ఇట్లా గుండబట్టే నా జీవితంకూడ సుమోస్తరుగా గడిచింది. ఈశ్వరుడు దయామయుడు. జగద్రక్షకుడు. ఆయన జపతపాదులలోనే ఇక ముందు మునిగిపోయే అవకాశాన్ని కల్పిస్తున్నాడు. ఆయన మహిమను ఎన్నినోళ్ళతో స్తుతించను! జీవితం ఇంకెంతకాలమో ఉండకపోవచ్చు జరిగిన దానికి లోచ్చు లేకుండ గడిస్తే ఆదేచాలు." అని ఆలోచించుకొంటూండగా ఎప్పుడో నిద్రపట్టిపోయింది.

తెల్లవారింది. మేడలో గోలపుట్టింది. ఇల్లు కొల్లగొట్టేరన్న వార్త ఒకటి బయలుదేరింది. అందరూ ఆశ్చర్యపోతున్నారు. గుమిగూడి మాట్లాడుకొంటున్నారు. ఎలాగు పోయిందో ఎవరికీ తెలియదు. ఇంటిలో నగదు, జవాహిరి అంతా ఖాళీ అయింది.

నానాగోలగానూ ఉంది. చూడవచ్చిన జనులకు ఆశ్చర్యం తప్పితే మరొకభావం పొడగట్ట లేదు ఎవరికీ ఎవరిమీదా అనుమానం లేదు. ఈ స్థితిలో కాంచనమూర్తికి ఎదురుపడక తప్పించుకొన్నారు కొందరు. ఆయనే కొందరి మొహాలు చూసి పలకరించలేక సిగ్గుతో తల వంచుకొన్నాడు.

వచ్చిన చుట్టాలు పెద్దలు. పిన్నలు వచ్చినట్లే నెమ్మది నెమ్మదిగా జారేరు క్రమంగా ఊరు ఎప్పటిలాగే ప్రశాంతం పొందింది. అంతకిమించి ఎవ్వరికీ ఏమీ తెలియదు.

---

విమర్శకుడు రచయితతో అన్నాడు: "మీ పుస్తకాలు మీకు డబ్బు సంపాదించి పెడుతున్నాయి నిజమే: కాని అలాంటి రచనలు తాత్కాలిక ప్రయోజనాన్నే కలిగిఉంటాయి నాలుగు కాలాలపాటు ప్రజల్లో నిలుస్తాయా?"

రచయిత అందు కిలా సమాధానం యిచ్చాడు: "నాలుగు కాలాలపాటు బతకవలసింది ముందు నేనా రచనలా అనే సమస్య వచ్చి, నేను బతకడమే ముఖ్యం అనుకున్నాను."